# అబద్ధం గెలిచింది

**- ప్రభాకర్**

**అది సంధ్యాసమయం. రాకేష్ డాబామీద కూర్చుని ఎంట్రెన్స్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్నాడు. ఆ చల్లటి వాతావరణంలో అటు ఇటూ తిరుగుతూ చదువుతున్న రాకేష్ ఒక్కసారిగా ఆగిపోయాడు...**

'సార్ మీకుత్తరం' అన్న పిలుపుతో డ్రాఫ్టురాస్తున్న రాకేష్ తలెత్తి చూసాడు. ప్యూన్ ఇనలాండ్ కవరుతన టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయాడు. కవరు తీసుకొని ఓ. మారు ఫ్రమ్ అడ్రస్‌వైపు చూసాడు. ఆ ప్లేస్ ఖాళీగా వుంది. ఎవరు రాసుంటారో అనుకొని కవరుచించి లెటరు బెలికి తీసి చూసాడు.

డియర్ రాకేష్.

మీరు క్షేమమని తెలుసుకున్నాను. అదెలాగంటారా! ఈ మధ్య మీ ఇంటికి వెళ్ళటం జరిగింది. మీ అమ్మగారు, ఎంతో బాధపడుతూ చెప్పారు. మీరు ఇంతవరకు పెళ్ళిచూపులలో చూసిన అమ్మాయిలలో ఏ ఒక్కరూ మీకు నచ్చలేదుట. కారణం అడిగితే ఏమీ చెప్పలేదట, ఏమిటీ ఏ సంగతీ చెబితే మీ అమ్మనాన్నల బాధ కాస్త తగ్గించే వాళ్ళయే వారేగా కానీ ఎందుకు చెప్పటంలేదు? మీకు...

'ఏం బ్రదర్ లంచ్‌కి బయల్దేరుదామా' అన్న పిలుపుతో ఉత్తరం చదవడానికి అంతరాయం కలిగింది.

కొలీగ్ సతీష్‌తో ఓ గంటముందే లంచ్‌కి వెళదామన్నాడు రాకేష్. ఇప్పుడు కాదు అంటే బాగుండదని 'సరేపద' అనిలేచాడు.

టిఫిన్ చేస్తున్నంతసేపూ సతీష్ ఏదో చెబుతూనే వున్నాడు. టైపిస్ట్ సీత నిన్నటిరోజున సాల్మా థియేటర్‌కు వచ్చినట్లు తన పక్క సీట్లో కూర్చుని చాలా చనువుగా మాట్లాడినట్లు ఆ మాటలలో అర్థాల గురించి సంతోషంగా చెప్పుకుపోతున్నాడు. అయితే, రాకేష్ అతని మాటలకు ఊ కొడుతున్నాడే గాని మనసు మాత్రం ఆ ఉత్తరం వైపేపోతున్నది.

ఆ ఉత్తరం ఎవరురాసారు? తన వ్యక్తిగత విషయాలతో ఆ వ్యక్తికి ఏమిటి సంబంధం? ఒకవేళ తనుచూసిన ఐదుగురమ్మాయిలలో ఏ అమ్మాయయినా ధైర్యం చేసి ఈ విధంగా రాయలేదు కదా! వ్రాసినా ఆ అమ్మాయికి ఒరిగేదేమిటి? లేదా నచ్చలేదన్నందుకు తనపై కక్ష తీర్చుకోవటానికి వ్రాసిందా! ఏమో అర్థం కావటంలేదు. తనకు తెలిసినంతవరకూ దస్తూరీ ఏ స్నేహితుడిదీ కాదు మరెవరై వుంటారో...

'ఏం బ్రదర్ వింటున్నట్టులేవే ఏ లోకంలో వున్నావ్?' రాకేష్ పరధ్యానాన్ని గమనించి భుజంపట్టి కుదిపాడు సతీష్.

'అబ్బే ఏంలేదు' తడబడ్డాడు రాకేష్.

ఇద్దరూ ఒక్కసారిగా అక్కడినుంచిలేచారు. సెక్షన్‌లో అడుగుపెడుతూనే ప్యూన్ వచ్చిచెప్పాడు.

'సార్! ఎమ్.డిగారు మిమ్మల్ని అర్జంటుగా కలవమన్నారు' వెంటనే వెళ్ళాడు.

పదినిమిషాల తరువాత ఎమ్.డి రూమ్‌నుండి నాలుగుఫైళ్ళతో ఇవతలకి వచ్చాడు రాకేష్.

ఓ ఫైలు సతీష్‌కు అందిస్తూ అన్నాడు! బ్రదర్ ఈ ఆఫీసులో ఓ క్షణం కాళీగా వుందామంటే కుదరదు. ఇదిగో ఇది ఈ రోజే పుటప్ చేయాలని చెప్పాడు బాస్' ఫైలు అందించాడు.

'ఒకే' అంటూ రాకేష్ ఇచ్చిన ఫైలు తీసుకున్నాడు సతీష్.

ఎమ్.డి చెప్పినట్లు మూడు పార్టీలకీ సంబంధించిన డ్రాఫ్టులు తయారుచేయడం మొదలుపెట్టాడు రాకేష్.

అవి పూర్తిచేసేసరికి సమయం సరిగ్గా నాలుగైంది. డ్రాఫ్టు ఫైళ్ళతో ఎమ్.డిరూంకి వెళ్ళాడు. మరో అరగంట తరువాత ఇవతలకి వచ్చాడు. ఉత్తరం చదవాలనిపించింది. కాని ఆ ప్రయత్నాన్ని మానుకున్నాడు. తిన్నగా కాంటీన్‌కి వెళ్ళి ఓ కప్పు కాఫీ త్రాగాడు. తిరిగి తన సీట్లోకొచ్చి కూర్చున్నాడు. మెల్లగా టేబుల్ సొరుగునుండి ఇందాకటి ఉత్తరం తీసాడు బయటకి. మళ్ళీ మొదటినుండి చదవడం ప్రారంభించాడు.

డియర్ రాకేష్.

మీరుక్షేమమని తెలుసుకున్నాను. అదెలాగంటారా! ఈ మధ్య మీ ఇంటికెళ్ళటం జరిగింది. మీ అమ్మగారు ఎంతో బాధపడుతూ చెప్పారు. మీరు ఇంతవరకు పెళ్ళిచూపులలో చూసిన అమ్మాయిలలో ఏ ఒక్కరూ మీకు నచ్చలేదుట, కారణం అడిగితే ఏమీ చెప్పలేదట. ఏమిటీ ఏ సంగతీ చెబితే మీ అమ్మనాన్నల బాధ కాస్త తగ్గించే వాళ్ళయే వారేగా, కానీ ఎందుకు చెప్పటంలేదు? మీకు ఎందుకు అమ్మాయిలు నచ్చలేదో నేను తెలుసుకోవచ్చా! అవును— నా గురించిగాని, నా పేరుగానీ ఈ ఉత్తరంలో లేదుకదూ, ఎవరని మీరు చెబుతారు.

నేనేనండీ, మీరు మీ ఉద్యోగ పరీక్షా ఫలితాలు వచ్చిన వెంటనే నా దగ్గరకి వచ్చి ఆ సంగతి చెప్పి మరొకటి ఇచ్చి వెళ్ళారుగా ఆ వ్యక్తినే నేను. ఇప్పుడైనా గుర్తుపట్టారా నేనెవరినో...

రాకేష్ మెదడు ఒక్కసారిగా పనిచేయడం ఆగిపోయింది. తిరిగి మెల్లమెల్లగా పనిచేయడం ప్రారంభించింది. తన ఊహల్లో మెదలాడుతున్న తన మనస్సును కలతచేసిన ఆ సౌందర్యరాసే అదే... అదే ఆమె రేవతి. గతరెండు సంవత్సరాలుగా తనని వెంటాడుతున్నది, తన ఉత్సాహాన్ని తన నిద్రనీ పాడుచేస్తున్నది. పెళ్ళిచూపుల్లో ఏ అమ్మాయి నచ్చకపోవటానికి ఆమే కారణం. ఇపుడెక్కడుందో! ఎక్కడినుండి ఈ ఉత్తరం రాసిందో!

అడ్రసు కూడా ఇవ్వలేదు. ఆమెని కలిసేదెలా ఆలోచనలో పడ్డాడు.

'ఏమండీ రాకేష్‌గారూ టైమయింది బయల్దేరరా!' ప్రక్క కాబిన్‌లోనుండి వర్మ ఇవతలకి వస్తూ అన్నాడు. రాకేష్ ఆలోచనలకు అంతరాయం కలిగింది. గబగబ తనటేబిల్ సర్దుకొని బయల్దేరాడు రాకేష్. తిన్నగా టాంక్‌బండ్ చేరుకున్నాడు ఓ బెంచీ ఖాళీగా వుంటే అక్కడికెళ్ళి కూర్చున్నాడు. జేబులోనుండి ఉత్తరం తీయబోయాడు మిగతామాటర్ ప్రశాంతంగా అక్కడ చదువుకోవాలని. కాని రాకేష్‌కి ఆశాభంగం కలిగింది. ఇందాక హడావుడిగా ఆఫీస్‌లో టేబుల్ సర్దాడు కాని జేబులో వుత్తరం పెట్టుకోడం మరిచాడు. 'డామిట్' తను చేసిన పొరపాటుకు తిట్టుకున్నాడు.

టాంక్‌బండ్ జనరద్దీ పెరుగుతోంది. జంటలు జంటలుగా ప్రేయసీ ప్రియులు, ఆలుమగలు చెట్టాపట్టాలేసుకొని హుసేన్‌సాగర్ నుండి వస్తున్న చల్లటిగాలిలో హుషారుగా కబుర్లు చెప్పుకొని పోతున్నారు. రాకేష్ వాళ్ళను చూస్తూ తను కూడా రేవతి లోకంలోకి వెళ్ళిపోయాడు...

రాకేష్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలు ప్రారంభిస్తున్న రోజుల్లో రేవతి ఆమె భర్త బోసుబాబు వాళ్ళింట్లో పక్కవాటాలో అద్దెకు దిగారు. రేవతిని మొట్టమొదట చూసిన రోజునే రాకేష్ అనుకున్నాడు. ఆమె అందాల రాశని. బోసుబాబు ఆమె ప్రక్కన బోసిగా కనిపించాడు కూడా. కొద్ది రోజుల్లోనే ఇంట్లో వాళ్ళందరికి ఆమెతో ఎంతో చనువు పెరిగిపోయింది. రాకేష్ చెల్లాయి ప్రవీణ ఎప్పుడూ ఆమెను వదినా వదినా అంటూ వెంటతచ్చాడేది. కారణం,



ఇద్దరికి నవలలు, పత్రికలు చదవడం పిచ్చి. రాకెష అప్పుడప్పుడు రేవతి అడిగిన నవలలు, పుస్తకాలు తెచ్చి ఇచ్చేవాడు. రేవతి పుస్తకాలు నవలలు అంటే ఎందుకు పిచ్చో రాకేష్‌కి తెలుసు. ఆమె భర్త బోసుబాబు ప్రొద్దునే డ్యూటీకని వెళ్ళిపోతాడు, తిరిగి రాత్రికి ఎప్పుడోవచ్చేవాడు. ఆ మధ్య సమయాన్నంతా పుస్తకాలతో గడపడం అలవాటు చేసుకొంది.

ఆ రోజు...

అది సంధ్యాసమయం. రాకేష్ డాబామీద కూర్చుని ఎంట్రెన్స్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్నాడు. ఆ చల్లటి వాతావరణంలో అటు ఇటు తిరుగుతూ చదువుతూ వున్న రాకేష్ ఒక్కసారిగా ఆగిపోయాడు.

బాత్‌రూం నుండి పలచటి చీర కప్పుకొని రేవతి ఆమె గదివైపు వెళుతున్నది. ఆమె పసిమిపచ్చని శరీరఛాయ నీరెండలో పసిమిముద్దలా ధగధగా మెరుస్తున్నది. ఆమె శరీరంపై నీటి బిందువులు ఆమె అందానికి మెరుగుపెడుతున్నాయి. రాకేష్ కళ్ళు ఆ అందాలని వెన్నంటాయి. రేవతి తనగదిలోకి వెళ్ళిపోయింది.

రాకేష్ ఇక అక్కడ ఓ క్షణం వుండలేకపోయాడు. తనకు తెలీకుండానే తనకాళ్ళు డాబా మెట్లు దిగడమారంభించాయి. రాకేష్ గుండె వేగం పెరిగింది. మెల్లగా కిటికీ ఓరగా నిలుచుని లోనికి చూసాడు.

రాకేష్ కుర్ర వయస్సు కళ్ళెం తెంచుకుంది. రేవతి తన అందాన్ని నిలువుటద్దంలో చూసుకొంటుంది. చీరకుచ్చెళ్ళు సరిగా కుదరలేదని రెండుమార్లు చీర తొలగించి మళ్ళీ కట్టుకొంది. అప్పుడుగాని ఆమెకు సంతృప్తికలిగింది కాదు.

రాకేష్‌కి ఆ సమయంలో ఆ విధంగా చూడడం తప్పనిపించలేదు సరికదా. అమాంతం వెళ్ళి రేవతిని ముద్దులతో నింపెయ్యాలని అనుకున్నాడు కాని అంత సాహసం చేయలేకపోయాడు. అయితే ఆ రోజునుండే రాకేష్ మనసులో రేవతి స్థిరనివాసం అయింది. ఆమెను మనసారా ప్రేమిస్తున్నానని ఆమె సరేనంటే పెళ్ళిచేసుకుంటానని' ఎన్నోసార్లు చెప్పాలని అనుకున్నాడు రాకేష్. కాని అతనికి ధైర్యం చాలలేదు. ఆమె తనను ప్రేమిస్తుందోలేదో తెలియదు. వయసులో తనకంటే రెండుమూడేళ్ళు పెద్దే అయినప్పటికీ ఆమె సరేనంటే ఆమెను వివాహం చేసుకుని ఎవ్వరూ తమని గుర్తుపట్టలేని సుదూర ప్రాంతానికి వెళ్ళిపోయి అక్కడ వివాహ జీవితాన్ని గడపాలని కలలు కనేవాడు.

ఆ రోజు అవును ఆరోజు, తనకు ఈ కంపెనీలో ఉద్యోగం వచ్చిన రోజు... ఆ రోజు సంఘటన రాకేష్ కళ్ళముందు కదలాడింది.

* * *

పోస్ట్‌మాన్ నుండి కవరు అందుకొన్నాడు తను. ఆతృతగా కవరు చింపిచూసాడు. పరీక్షపాసయి ఉద్యోగానికి అర్హత పొందినట్లు పదిహేను రోజులలోగా ఉద్యోగంలో జాయిన్ అవమంటూ కంపెనీ నుండి ఆర్డర్స్. అంతే సంతోషంతో గంతులేయాలని అనిపించింది కానీ అంతలోనే అలాచేయకుండా ఉత్సాహాన్ని లోలోపలే

దాచుకున్నాడు.

ఎందుకంటే ఆ విషయం ముందుగా రేవతితో తనే చెప్పాలి. అలా చెప్పటం తనకో ఆనందం. అందుకే ఉత్తరం పాంటుజేబులో పెట్టుకుని మెల్లగా రేవతి గదివైపు వెళ్ళాడు. రేవతి మంచంమీద ఒయ్యారంగా మెలితిరిగి పడుకుని వుంది. చేతిలో ఓ తెలుగు నవల. రాకేష్ మెల్లగా ఆమెను సమీపించాడు. ఆమె ఆ భంగిమలో ఎంతోముద్దొస్తున్నది. అలాగే ఒక్కక్షణం చూస్తూ వుండిపోయాడు.

రేవతి చదువుతున్న పుస్తకం నుండి తలతిప్పి చూసింది. రాకేష్ కవరు చేతిలో పట్టుకొని నిలుచున్నాడు. అతని కళ్ళలోకి చూసింది ఆమె. అతని కళ్ళు ఆనందంతో క్రిందికి వాలాయి. 'రాకేష్‌గారు' అంటూ మంచంమీద నుండి లేవబోయింది. రాకేష్ ఆమె ప్రయత్నానికి అడ్డువస్తూ 'రేవతిగారు నాకు ఉద్యోగం వచ్చింది' అంటూ అమాంతం ఆమె పెదవులపై ముద్దుపెట్టాడు. ఈ హఠాత్పరిణామానికి ఒక్కక్షణం పాటు ఆమె నిర్ఘాంతపోయింది. రాకేష్ ఆమె ఎదురుగా మరోక్షణం నిలవలేకపోయాడు. ఒక్కొక్కడుగు వెనుకకు వేస్తూ మెల్లగా ఆమెనుండి దూరంగా కదిలాడు 'సారీ' అని గొణిగి ఆమె గదినుండి బయటపడ్డాడు. వంటగదిలోకెళ్ళి రెండు గ్లాసుల మంచినీళ్ళు త్రాగి మెల్లగా తన గదిలోకి వెళ్ళి మంచంమీద వాలాడు.

తను ఎన్నో రోజులనుండి ఆ పని చేద్దామనే అనుకున్నాడు కాని సరియైన సమయం దొరకలేదు. ఈ రోజు తనకు ఆ అవకాశం వచ్చింది వినియోగించుకున్నాడు. అది తనకెంతో విలువైనది. కొత్త అనుభూతితో కూడుకున్నది. ఆమె పెదాలవేడి తన పెదాలకు ఇంకా అంటిపెట్టే వున్నట్టుంది. ఆమె భంగిమ ఇంకా కళ్ళముందు మెదలుతూనే వుంది.

రాకేష్ మనసు ఆ అనుభూతితో నిలువలేకపోయింది. దానివెనకే భయం కూడా చోటుచేసుకుంది. ఇందాక ధైర్యం చేసి తను సాధించాలనుకొన్నది సాధించాడు కాని ఆ చర్య ఆమెకు నచ్చిందో లేదో! నచ్చని పక్షంలో ఆ విషయం ఆమె భర్తతో చెబితే ఇంకేమన్నా వుందా పెద్ద గందరగోళం చెలరేగుతుంది. ఊరు వాడా మారుమోగుతుంది. కాని... కాని ఆమె చెప్పలేదు. ఎందుకంటే ఏ మగాడు తన భార్యను మరోమగాడు తాకితే ముందు ఆమెనే పతిత అని ఇంటినుండి గెంటేస్తాడు. అందుకే రేవతి ఆ విషయం తన భర్తతో చెప్పలేదు. ఒకవేళ ఆమె ఈ విషయం అమ్మతో చెబితే ఇంట్లో చెల్లాయిముందు నాన్నముందు తన పరువేం కాను. ఇలా పలువిధాల ఆలోచిస్తూనే రాకేష్‌కు ఆ రోజు రాత్రంతా నిద్రపట్టలేదు.

రెండ్రోజులు రేవతి గదివైపు పోలేదు.

అమ్మ, చెల్లాయి రాకేష్‌తో మామూలుగానే మాట్లాడుతున్నాడు. తనకు ఉద్యోగం వచ్చిందని పదిరోజుల్లో తను హైదరాబాద్ వెళ్ళాలని అప్పుడు ఇంట్లో వాళ్ళకి చెప్పాడు.

రాకేష్ అమ్మ ఎంతో సంతోషపడిపోయింది. 'పోనీరా నాన్నా హైదరాబాదైతేనే మరే వూరయితేనే ఇన్నాళ్ళూ నువ్వు కష్టపడినందుకు ఉద్యోగమొచ్చింది. చెల్లాయి పెళ్ళి జరిపించి వెంటనే నీకు పెళ్ళి జరిపించా లని వుంది' అని అంది.

రేణుక అన్నయ్య చెప్పిన శుభవార్తను వెంటనే రేవతి దగ్గరకి మోసుకుపోయింది.

'ఒదినా అన్నయ్యకి ఉద్యోగం వచ్చింది. అదేదో సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగమట. పదిరోజుల్లో జాయిన్ అవాలట హైదరాబాద్ వెళ్ళిపోవాలట' అంటూ చెప్పేస్తుంది.

రేవతి నవ్వు తెచ్చుకొంటూ 'చాలా సంతోషం రేణు. అన్నయ్యకు ఉద్యోగం వచ్చిందంటే ఈ అమ్మాయికి ఇక పెళ్ళి జరిగిపోయినట్లే' అంటూ బుగ్గగిల్లింది. 'పో వదినా' అంటూ ఇవతలకి వచ్చేసింది రేణు.

* * *

ఆరోజు హైదరాబాద్‌కు ప్రయాణం. రాకేష్ బెడ్డింగ్ బేగ్ భుజాన వేసుకుని గేటు ఇవతలకి వచ్చాడు. రేణు, అమ్మనాన్నలు గేటుదాకా వచ్చారు. వాళ్ళ వెనకే రేవతి నిల్చుంది.

హైదరాబాద్ వెళ్ళాక తను జాగ్రత్తలేవి తీసుకోవాలో అమ్మానాన్న ఒకళ్ళు తర్వాత ఒకళ్ళు చెబుతూనే వున్నారు. చెల్లాయి సంబరంగా నవ్వుతోంది.

అందరితోను ఒస్తాను అని చెప్పి రేవతి వంక ధైర్యం చాలక మెల్లగా ఆమెవైపు చూసాడు. రేవతి మందహాసం చేస్తూ 'ఆల్ ది బెస్ట్ రాకేష్‌గారూ' అంది.

అంతే ఈ పదిరోజులు నుండి మధనపడుతున్న తన మనస్సుకు స్వాతిజల్లు కురిసినట్లయింది.

'థాంక్స్ అండి' అంటూ హుషారుగా బయల్దేరాడు స్టేషన్‌కి.




* * *

టాంక్‌బండ్ రోడ్డంతా జనం.

ఏక్సిడెంట్.

కారూ మోటారుసైకిల్ ఢీకొన్నాయి.

మోటార్ సైకిల్‌వ్యక్తికి గాయాలు.

జనం కారుడ్రైవర్‌పై విరుచుకుపడుతున్నారు.

రాకేష్ ఈ గొడవకు తన ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి తిన్నగా తన రూమ్‌కి బయలుదేరాడు.

* * *

మరుసటిరోజు రాకేష్ ఓ అరగంట ముందుగానే ఆఫీసుకి బయలుదేరాడు. ఆఫీసుకి చేరుకునేసరికి టైమ్ సరిగ్గా తొమ్మిదిన్నర అయింది. తిన్నగా తన సీట్‌లోకి వెళ్ళి కూర్చుని రేవతి రాసిన ఉత్తరం తీసాడు. గబగబా మిగతా విషయాలు చదివాడు. ఒక్కసారిగా తన గుండెల్లో అగ్నిపర్వతం బ్రద్దలైంది. తన గుండెలోంచి ఆవేశం, అసూయ, అసహ్యం, ఆవేదన అన్ని లావాలా పెల్లుబికాయి. వెంటనే ఓ తెల్లకాగితం తీసి లీవ్‌లెట్ రాసి లీవ్‌లెటర్ ఫ్యూన్ చేతిలో పెడుతూ పర్సనల్ మేనేజర్‌కి ఇచ్చేయి అంటూ ఆఫీసు బయటకి నడిచాడు. ఫర్లాంగ్ దూరంలో వున్న పోస్టాఫీసువైపు గబగబా నడక సాగించాడు. కౌంటర్‌నుండి ఓ ఇన్‌లాండ్‌లెటర్ తీసుకొని వ్రాయడం మొదలుపెట్టాడు.

పూజ్యులైన నాన్నగార్కి.

నేను క్షేమం మీరంతా క్షేమమని తలుస్తున్నాను. మొన్న విజయవాడలో చూసిన అమ్మాయి నాకు నచ్చింది. ఈ విషయం మీముందు చెప్పటానికి సిగ్గుపడ్డాను. అందుకే ఈ ఉత్తరం ద్వారా తెలియజేస్తున్నాను. వెంటనే పెళ్ళికి ముహూర్తాలు పెట్టించండి.

అమ్మకి మీకు నా నమస్కారములు

ఇట్లు
రాకేష్

ఉత్తరం మడతపెట్టి పోస్టుడబ్బాలో పడేసాడు.

రాకేష్‌లో ఇంతటి హఠాత్మార్పుకు కారణం

రేవతి వ్రాసిన ఉత్తరంలో ఇలా వుండటమే!

'... రాకేష్ నీవు ఉద్యోగం కోసం హైదరాబాద్‌కి వెళ్ళిన మరో వారం రోజులకే మా శ్రీవారికి ట్రాన్స్‌ఫర్ అయింది. ప్రస్తుతం మేము విశాఖలో వుంటున్నాం.

మేము అద్దెకుంటున్న ఇంట్లో నీలాగే ఓ అందమైన కుర్రాడు దొరికాడు. నీ అంత పిరికివాడు కాదు సుమా. ధైర్యంగా నన్ను పెళ్ళి చేసుకుంటాను అని చెప్పాడు. మా వారికి విడాకులు ఇచ్చేసాను. ప్రస్తుతం ఆ అందమైన హీరోతో పెళ్ళిచేసుకొని జలసాగా కాలం వెళ్ళబుచ్చుతున్నాను. ఒకవేళ నీవు నన్నుగాని మనసులో పెట్టుకొని నీ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నావేమో అన్న బాధతో ఈ ఉత్తరం వ్రాసాను. పెళ్ళి చేసుకొని మీ అమ్మా నాన్నల బాధ్యత నీవు తీరుస్తావనే ఆశతో.

ఒకప్పటి స్నేహం—

అయితే రేవతి ఈ ఉత్తరం సానుభూతితో వ్రాసినట్లు గాని బోసుబాబునే ప్రేమిస్తూ వైవాహిక జీవితాన్ని గడుపుతున్నట్లుగాని రాకేష్‌కి తెలియదు పాపం. ఏమైతేనేం ఇప్పుడు ఆమె చెప్పిన అబద్ధం గెలిచి, రాకేష్‌ని ఒకింటివాడిని చేసింది. ✱